మాట్లాడుతున్న పుట్ట మధూకర్

## ఇప్పటికైనా కార్యకర్తలు కండ్లు తెరవాలి

- కాంగ్రెస్‌లో జెండా మోసినోళ్లకు గుర్తింపు లేదు
- పార్టీ కోసం పనిచేసిన సీనియర్లకు అన్యాయం చేస్తరా..?
- శ్రీనుబాబు ఏం చేశాడని పదవి ఇచ్చారు..?
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, జూన్ 12: కాంగ్రెస్‌లో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన సీనియర్ నాయకులు, జెండా మోసినోళ్లకు గుర్తింపు లేదని, పదవులు దక్కవని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. ఇప్పటికైనా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కండ్లు తెరవాలని సూచించారు. మంథనిలోని రాజగృహలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంథని నియోజకవర్గంలో తరతరాలుగా కాంగ్రెస్ జెండాలు మోసిన నాయకులు పదవులకు అర్హులు కాదా..? అని ప్రశ్నించారు. శ్రీపాదరావు నుంచి మొదలుకొని నేటి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాల్లోని నాయకులు పార్టీ కోసం పని చేశారని గుర్తు చేశారు. ఏ సామాజికవర్గ నాయకుడికి సరైన పదవి, గౌరవం ఇవ్వలేదన్నారు. గతంలో పీసీసీ సభ్యుడిగా శ్రీధర్‌బాబుతో పాటు మాజీ ఎంపీపీ బొల్లంకొండ కిష్టయ్యను నియమించారన్నారు. కానీ ఆయన ఇప్పటి వరకు ఈ సమాజానికి ఎవరో తెలియదని, ఆయన ఫొటోను కూడా ఎక్కడా పెట్టలేదని విమర్శించారు. అదే దుద్దిళ్ల కుటుంబంలో మాత్రం ఎవరికీ పదవులు వచ్చినా ఇక్కడి నాయకులు సంబురాలు జరుపుకుంటున్నారన్నారు. ప్రజల కోసం ఏం పోరాటం చేశాడని దుద్దిళ్ల శ్రీనుబాబుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారో అర్థం కావడం లేదన్నారు. దుద్దిళ్ల కుటుంబానికి పదవులు వస్తే సంబురాలు చేసుకుంటూ,కాంగ్రెస్‌లో కొనసాగుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పలువురు నాయకులు బానిసలుగానే ఉంటున్నారన్నారు. ఇన్ని రోజులు పార్టీ అభివృద్ధి కోసం పని చేసిన నాయకులు పదవులు రాకపోవడంపై ఆలోచన చేయక పోవడం చాలా బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 17 నెలలు గడుస్తున్నా నియోజకవర్గంలో నామినేటేడ్ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. అదే పక్కనే ఉన్న పెద్దపల్లి, రామగుండం, భూపాలపల్లి నియోజకవర్గాల్లో మార్కెట్ కమిటీలు, దేవస్థాన కమిటీలు వేశారని గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్‌గా ఉన్న సమయంలో తమ పార్టీ కోసం పని చేసిన నాయకులకు నామినేటేడ్ పదవులు ఇచ్చి గౌరవించామని గుర్తు చేశారు. మంథని నియోజకవర్గ కాంగ్రెస్‌లో కేవలం దుద్దిళ్ల కుటుంబానికి మాత్రమే పదవులు, అధికారం అనే విషయాన్ని అన్ని కులాలకు సంబంధించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇప్పటికైనా గుర్తించి, కండ్లు తెరవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జక్కు రాకేష్, ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, కాయితీ సమ్మయ్య, మాచిడి రాజుగౌడ్, రాజిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాఘవాపూర్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు

పెద్దపల్లి రూరల్, జూన్ 12: న్యాయ సేవలపై మరింత అవగాహన పెంచేందుకు న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తూ చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని జిల్లా జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కే స్వప్నరాణి అన్నారు. మండలంలోని రాఘవాపూర్‌లో గురువారం న్యావిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రదానంగా బాల కార్మిక చట్టాలపై కఠినంగా ఉండాలన్నారు. పిల్లలను చదువులకు పంపించి భవిష్యత్ తరాలకు భావి పౌరులను తయారు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ జిల్లా కమిటీ సభ్యులు నుచ్చు శ్రీనివాస్ యాదవ్, భానుకృష్ణ, సంకీర్తన, శరత్, ఝాన్సీ, న్యాయవాదులు హన్మాన్‌సింగ్, హెచ్ఎం హన్మంతు పాల్గొన్నారు.

# నేడు ఠాణాలను ప్రారంభించనున్న మంత్రులు

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఎలిగేడు: ఠాణా పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి, జూన్ 12(నమస్తే తెలంగాణ)/ఎలిగేడు: రాష్ట్ర మంత్రులు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులతో పాటు ఇటీవల జిల్లాకు మంజూరైన కొత్త పోలీస్ స్టేషన్లను ప్రారంభించనున్నారు. జిల్లాలోని ఎలిగేడు, పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్, కలెక్టరేట్ సమీపంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని మహిళా పోలీసు స్టేషన్, పెద్దపల్లి సాగర్‌రోడ్డు వద్దగల కూరగాయల మార్కెట్‌లో నూతన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన, చందపల్లి, రాంపల్లిల్లో డబుల్ బెడ్రూం ఇండ్లను మంత్రులు ప్రారంభించనునారు. చందపల్లిలో పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొనేలా మంత్రుల పర్యటనను రూపొందించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

**మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు**

జిల్లాలో మంత్రు లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పర్యటించనున్నారని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎలిగేడులో నిర్మించిన పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాట్లను కలెక్టర్ పర్యవేక్షించారు. జిల్లాలో ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య,ఏసీపీ కృష్ణ,ఎలిగేడు తహసీల్దార్ యాకన్న, పెద్దపల్లి మున్సిపల్ కమీషనర్ వెంకటేష్, పిడీ హౌసింగ్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## ముందు హామీలు నెరవేర్చండి

ఎలిగేడు,జూన్ 12 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ స్రవంతి మోహన్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, సంక్షేమ హామీలు మరచి, ప్రశ్నించే ప్రజల గొంతునొక్కడానికి పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారని విమర్శించారు. బీసీ హాస్టల్, మోడల్ స్కూల్,జూనియర్ కాలేజీ లేక ఇక్కడి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జూనియర్ కాలేజీ బిల్డింగ్‌లోనే పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామాల్లో అర్హులను విస్మరించి కాంగ్రెస్ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం సిగ్గు చేటని విమర్శించారు. ఎలిగేడు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రజల భూ సమస్యలు పూర్తిగా పరిష్కరించలేదని మండిపడ్డారు. గత పద్నేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేని కాంగ్రెస్ నాయకులు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. సమావేశంలో మండలాద్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ స్రవంతి మోహన్‌రావు, కప్పల ప్రవీణ్, న్యాతరి పోచాలు, కాంపల్లి బాపయ్య, బద్దం తిరుపతిరెడ్డి, బాసంపల్లి రాజేష్, బాసంపల్లి వినోద్, బోయిన సత్యం, అనిల్, గొళ్లే, లక్ష్మణ్, చెవుల అజయ్ లతో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయం తనిఖీ

పెద్దపల్లి కమాన్, జూన్ 12 : జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పాఠకులతో మాట్లాడి అక్కడి సదుపాయాలు, సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాల వివరాలను అందిస్తే, వెంటనే తెప్పిస్తామని తెలిపారు. ఇక్కడ గ్రంథాలయ సిబ్బంది, అధికారులు, పాఠకులు ఉన్నారు.

## కీలక ఖనిజాల ఉత్పత్తికి సింగరేణి ఒప్పందం

గోదావరిఖని, జూన్ 12: సింగరేణి సంస్థ కీలక ఖనిజాల రంగంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో భువనేశ్వర్‌లో గురువారం ప్రముఖ పరిశోధనా సంస్థ సీఎస్ఐఆర్( కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) అనుబంధ సంస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీతో ప్రయోజన అవగాహన ఒప్పందం కుదిరినట్లు సీఎండీ బలరామ్ పేర్కొన్నారు. భువనేశ్వర్‌లోని నీతి అయోగ్ సభ్యులు డీఆర్డీవో మాజీ డైరెక్టర్ జనరల్, పద్మభూషణ్ వీకే సారస్వత్ సమక్షంలో జరిగిన ఒప్పంద సమావేశంలో సింగరేణి సీఎండీ, సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ డైరెక్టర్ డాక్టర్ రామానుజ్ నారాయణ్, ఇరు సంస్థల అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు కీలక ఖనిజాల రంగంలోకి అడుగు పెట్టాలని నిర్ణయించిందని, ఈ క్రమంలోనే ఈ ఒప్పందం చేసుకున్నట్లు సీఎండీ వివరించారు.

పెద్దపల్లి కమాన్: జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న టీచర్లు

## పాఠశాలలు పునః ప్రారంభం

పెద్దపల్లి కమాన్/ధర్మారం, జూన్ 12 : గత ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు అన్ని యాజమాన్యాల విద్యాసంస్థలకు వేసవి సెలవులు ఇవ్వగా, గురువారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. 50 రోజుల పాటు ఆట పాట లు, సమ్మర్ క్యాంపు, విహార యాత్రలతో గడిపిన విద్యార్థులు మళ్లీ బడి బాట పట్టారు. తొలిరోజు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు పూలు ఇచ్చి స్వాగతం పలికారు. సెలవుల అనంతరం స్నేహితులను కలుసుకున్న విద్యార్థులు సంతోషంగా కబుర్లు చెప్పుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 535 పాఠశాలల్లో 30, 687 మంది విద్యార్థులకు గాను 1,72, 348 పాఠ్య పుస్తకాలు ఆయా పాఠశాలలకు చేరుకోగా, విద్యార్థులకు 50,668 పంపిణీ చేసినట్లు డీఈవో మాధవి తెలిపారు. 17,866 జతల యూనిఫామ్స్ పాఠశాలలకు చేరగా, అందులో 10,281 జతలు విద్యార్థులకు అందజేసినట్లు వివరించారు. మిగతా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ ఈ నెల 16లోపు అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 6న జిల్లాలో ప్రా రంభమైన బడిబాట కార్యక్రమం ద్వారా ఇప్ప టి వరకు 1924 మంది విద్యార్థులు 1 నుంచి 6వ తరగతుల్లో ప్రవేశాలు పొందినట్లు తెలిపారు. ధర్మారం మండలం పత్తిపాక జడ్పీ హెచ్ఎస్, కాళ్వశ్రీరాంపూర్ జడ్పీహెచ్ఎస్, పెద్దపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో డీఈవో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందజేశారు. ఎంఈవో సురేందర్, ఇన్‌చార్జి హెచ్ఎం సురేంద్రప్రసాద్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ధర్మారం మండలం పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో తొలిరోజు 14 మంది విద్యార్థులు ప్రవేశం పొందడంతో డీఈవో మాధవి ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.ఆమె వెంట ఎంఈవో పీ ప్రభాకర్ హెచ్ఎంలు ఖండేరావు పరీక్షిత్, నరేందర్ రావు, నూతి మల్లయ్య,కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ ప్రేమ్‌సాగర్,ఉపాధ్యాయులు

జూలపల్లి : ఆదర్శ పాఠశాలలో పిల్లలను చేర్పిస్తున్న టీచర్ సుంకె రాజు

## 'ఆదర్శ' ఉపాధ్యాయులు

జూలపల్లి, జూన్ 12 : ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ ప్రైవేట్ విద్యా సంస్థల్లో తమ పిల్ల లను చదివిస్తున్న ఈ రోజుల్లో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను సర్కార్ బడిలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. కరీంనగర్‌కు చెందిన సుంకె రాజు పెద్దాపూర్‌లోని 'ఆదర్శ' పాఠశాలలో పీజీటీ సివిక్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. జ్యోతినగర్‌లోని సాధన ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు కొడుకులను తాను పని చేస్తున్న పాఠశాలలో ప్రవేశం కల్పించి స్ఫూర్తిదాయకంగా నిలిచాడు. ఈ క్రమంలో గురువారం ఉదయ్‌కార్తికేయ పదో తరగతి, గౌతమ్ కార్తికేయను ఆరో తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సాదుల్, ఉపాధ్యాయులు రాజును అభినందించారు. సర్కార్ స్కూళ్లలో ప్రభుత్వ ఉద్యోగులు తమ పిల్లలను చేర్పించి తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఎన్టీపీసీ టీటీఎస్‌లో జడ్పీహెచ్ఎస్‌లో**

జ్యోతినగర్ : ఉపాధ్యాయుడు జావిద్ అతని కొడుకును సన్మానిస్తున్న పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు

జ్యోతినగర్, జూన్ 12: ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎండీ జావిద్ తాను పని చేస్తున్న పాఠశాలలో తన కుమారుడు నవీద్ రెహమాన్‌ను చేర్పించితోటి ప్రభుత్వ ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచాడు. కాళ్వశ్రీరాంపూర్ మం డలం నుంచి గత ఏడాది బదిలీపై వచ్చిన జావిద్ స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ డైరెక్టర్‌గా పాఠశాలలో పనిచేస్తున్నాడు. వేసవి సెలవుల అనంతరం గురువారం నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాగా, జావిద్ తన కొడుకును ఏడోతరగతిలో చేర్పించాడు. హెచ్ఎం జయరాజ్, తోటి ఉపాధ్యాయులు జావిద్, అతని కుమారుడిని సన్మానించారు. అలాగే జావిద్ తన చిన్న కుమారుడు టిప్ ఉల్ రహమాన్‌ను కూడా నాలుగో తరగతికి ఎన్టీపీసీలోని దుర్గయ్యపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం చేర్పించనున్నట్లు తెలిపారు.

## యూబీఐలో బీమా పథకాలపై అవగాహన

బీమా బాండ్ అందజేస్తున్న డిప్యూటీ కమిషనర్, బ్యాంకు మేనేజర్

జ్యోతినగర్, జూన్ 12: రామగుండం నగరపాలక సంస్థ మెప్మా ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేడిపల్లి-లింగాపూర్ బ్రాంచిలో బ్యాంకు బీమా పథకాలపై ఖాతాదారులకు అవగాహన గురువారం అవగాహన కల్పించారు. కార్పొరేషన్ డిప్యూటీ కమి షనర్ నాయిని వెంకటస్వామి బ్యాంకు బీమా పథకాలను వివరిం చారు. వార్షిక ప్రీమియం సురక్ష బీమాకు రూ. 20, జీవనజ్యోతి బీమాకు రూ. 436 చెల్లింపులతో రూ. 2లక్షల చొప్పున బీమా అందుకోవచ్చని వివరించారు. ఖాతాదారులు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురు ఖాతాదారులకు బీమా బాండ్లు అందజేశారు. బ్యాంకు మేనేజర్ గజెల్లి భీమేశ్, అధికారులు కృపారావు, కీర్తి, శివ, అనిల్, మెప్మా అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## గూగుల్ వికీపీడియాలో మడక వాసి

ఆడెపు రజనీకాంత్

ఓదెల, జూన్ 12: మడక గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆడెపు రజనీకాంత్ వికీపీడియాలోకి ఎక్కారు. జాతీయం గా, అంతర్జాతీయంగా విభిన్న రంగాల్లో రాణిస్తున్న వారి గురించి ప్రపంచంలో కొత్త ఆవిష్కరణలు చేసే వారి గురించి వికీపీడియాలో సమాచారం పొందుపరుస్తారు. సుమారు వెయ్యికి పైగా తన సూక్ష్మ కళాఖండాలను విభిన్న ఆకృతులతో చెక్కి అంతర్జాతీయంగా రికార్డు హోల్డర్స్, రిపబ్లిక్ వరల్డ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, సృజనపుత్ర, కళారత్న, గ్రామీణ కళాజ్యోతి, ఉత్తమ కళాకారుడిగా ఎన్నో అవార్డులు అందుకున్నారు. ప్రపంచంలో అతి సూక్ష్మమైన ఎత్తు కలిగిన గణపతిని పెన్సిల్ గ్రాఫైట్‌పై గుండు పిన్ను సహాయంతో చెక్కినందుకుగాను గూగుల్ వికీపీడియాలో సమాచారం పొందిపర్చినట్లు గూగుల్ వికీపీడియా సమాచార సేకరణకర్త ఆత్రపు మోతీరామ్ తెలిపారు. రజనీకాంత్‌ను పలువురు అభినందించారు.

## ఉచిత అంత్యక్రియలు పునరుద్ధరించాలి

కోల్‌సిటీ, జూన్ 12: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గోదావరిఖని శివారు శ్మశాన వాటికలో ఉచిత దహన సంస్కారాల పద్ధతిని పునరుద్ధరించాలని 25వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు కోరారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీని కలిసి వినతి పత్రం అందజేశారు. శ్మశాన వాటికలో పేద,మధ్య తరగతి ప్రజలకు ఉన్న సౌలభ్యాన్ని ఎత్తివేయడం తగదన్నారు.దహన సంస్కారాలకు రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు అవుతున్నాయని, పేదలు ఖర్చులు భరించలేకపోతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 25వ డివిజన్‌లో కుక్కల బెడద, మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. చిన్నపిల్లలు, మహిళలు బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. పారిశుధ్యం లోపించి వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## కోతుల బెడద నివారణకు చర్యలు

కోల్‌సిటీ, జూన్ 12: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో కోతుల బెడద నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల నమస్తే తెలంగాణ దినపత్రికలో కోతుల బెడదపై వరుస కథనాలు ప్రచురితం కావడంతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణ శ్రీ స్పందించి ఈ చర్యలకు శ్రీకారం చుట్టారు. కలెక్టర్ ఆమోదంతో నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు రూ.10 లక్షల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. టెండర్ దక్కించుకున్న ఏజెన్సీ బుధ, గురువారాల్లో రామగుండం రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాలలో కోతులను పట్టి బోన్లలో బంధించారు. వాటిని వాహనాల్లో తరలించి అడవుల్లో వదిలివేయనున్నారు. నగరంలో అన్ని చోట్ల కోతులను పట్టిస్తున్నామని కార్పొరేషన్ ఈఈ రామన్ తెలిపారు. ఇంకా ఎక్కడైనా కోతుల బెడద ఉంటే నగర పాలక సంస్థ కాల్ సెంటర్ 9603666444కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★Wanted Female Accountants, Qul: B.Com(Accounts), Exp: 2 Yrs in Tally Software, Job Location Karimnagar, Salary: 12K-15K per Month, Negotiable, Interested candidates can send resume: 8977919477 (Whatsup), email: anilcholleti.ca@gmail.com.
NTK-350007

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## విద్యార్థుల సంఖ్య పెంచాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

కాళ్వశ్రీరాంపూర్, జూన్12: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య సూచించారు. కాళ్వశ్రీరాంపూర్ లో శుక్రవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు 20 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, దుస్తులను పంపిణీ చేసి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కొమురయ్యను ఎంఈవో మహేశ్ సత్కరించారు. కార్యక్రమంలో డీఈవో మాధవి, ఎంఈవో మహేశ్, హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టా భూములుగా మార్చాలని వినతి

కాళ్వశ్రీరాంపూర్, జూన్12: కూనారం శివారులోని సర్వే నెంబర్ 800 నుంచి 854 వరకు ఉన్న సుమారు 200 ఎకరాల వ్యవసాయ భూమి రిజర్వ్ ఫారెస్ట్ అని తప్పుగా నమోదైందని, వాటిన వెంటనే సవరించాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్ జగదీశ్వర్‌రావుకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ కూనారం సహకార సంఘం చైర్మన్ గజవెల్లి పురుషోత్తం, మాజీ చైర్మన్ కొట్టె సమ్మయ్య, నాయకులు తిరుపతి, శంకర్ ఉన్నారు.

## విద్యుత్ షాక్‌తో గొర్రెలు మృతి

సుల్తానాబాద్ రూరల్,జూన్12: మండలంలోని బొంతకుంటపల్లిలోని రావుల దుబ్బకు మేతకు వెళ్లిన గొర్రెలు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామలంలోని గుండేటి కుమార్‌కు చెందిన గొర్రెలు గురువారం రోజువారీగానే మేతకు వెళ్లాయి. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై రెండు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దాదాపుగా వాటి విలువ రూ. 30 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థిక సాయంఅందించి ఆదుకోవాలని కుమార్ కోరారు.

## రక్షణతో కూడిన విధులు నిర్వహించాలి

గోదావరిఖని, జూన్ 12: ప్రతి ఉద్యోగి పనిస్థలంలో రక్షణతో కూడిన విధులు నిర్వహించాలని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. గురువారం జీడీకే 1,3 ఇంక్లైన్ ఉద్యోగులతో జీఎం ఉత్పత్తి, ఉత్పాదకత, నాణ్యత, రక్షణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ నెలలో వందశాతం ఉత్పత్తితో ముందుకు సాగుతున్న ఉద్యోగులను అభినందించారు. జీఎం సేఫ్టీ కార్పొరేట్ ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణకు ప్రత్యేక భద్రతపై అవగాహన కల్పించారు. ఇక్కగ గని పిట్ ఇంజినీర్, వెంటిలేషన్ ఆఫీసర్, షిఫ్ట్ ఇన్‌చార్జి, సర్వే ఆఫీసర్, వెల్ఫేర్ ఆఫీసర్, తదితరులు ఉన్నారు.

## రైతులకు అవగాహన

సుల్తానాబాద్‌రూరల్,జూన్12: మండలంలోని కాట్నపల్లి రైతు వేదికలో గురువారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ మాంస పరిశోధనా స్థానం సంచాలకుడు డాక్టర్ ఎస్‌బీ బార్ బుద్దే మాట్లాడారు. రైతులు తమ ఆదాయం రెట్టింపునకు గొర్రెలు, మేకల పెంపకంతో పాటు కోళ్ల పెంపకం మీద కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక స్కీముల ద్వారా సబ్సిడీ అందిస్తున్నదని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, డాక్టర్ శంకర్, డాక్టర్ కన్నకి, ఏ శ్రీనివాస్, బాబ్జి, డాక్టర్ భాస్కర రావు, డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ బసవ రెడ్డి, డాక్టర్ బాబ్జీ, నవ్య, శ్రీనాథ్, బాలాజీ ఉన్నారు

## ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులతో సమీక్ష

రామగిరి,త జూన్ 12 : రామగుండం-3 ఏరియా జీఎం కార్యాలయంలో ఎల్అండ్‌టీ కంపెనీ ప్రతినిధులు, రామగుండం-1,2,3 ఏరియా ఇంజనీర్లు, మూడు ఏరియాల్లోని వివిధ గనుల ప్రాజెక్ట్ ఇంజినీర్లతో కార్పొరేట్ ఉపరితల గనుల విభాగం జనరల్ మేనేజర్ డీవీ సూర్యనారాయణరాజు, ఆర్జీ -3 జీఎం కొలిపాక నాగేశ్వరరావుతో కలిసి కాస్ట్ క్యాప్, డిపో అగ్రిమెంట్లు, భారీ యంత్రాల పని తీరు, యంత్రాల విడిభాగాలు, మరమ్మతులు తదివతర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధులు బాలభాస్కర్, రవిచంద్రన్, ఆర్జీ-1,2,3 ఏరియా ఇంజనీర్లు డీవీ రావు, ఎం.నర్సింహా రావు, వై.విజయశేఖరబాబు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణానికి రెడ్ క్రాస్ సొసైటీ చేయూత

రామగిరి, జూన్ 12: రత్నాపూర్ పంచాయతీ పరిధిలోని సంజీవ్ నగర్‌లో దళిత కుటుంబానికి చెందిన బెజ్జాల అనిల్ - మమతకు పెద్దపల్లి రెడ్ క్రాస్ సొసైటీ అండగా నిలిచింది. కూలీన